
సాక్షి అనకాపల్లి

బుధవారం । 9 । అక్టోబర్ । 2024



సింహగిరిపై నేడు ఆయుధపూజ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో బుధవారం ఆయుధ పూజ నిర్వహించనున్నారు.



స్టాంపుల ప్రదర్శన

సీతంపేట: నేషనల్ ఫిలాటలీ డే సందర్భంగా విశాఖ ద్వారకానగర్ పౌర గ్రంథాలయం ఆవరణలో మంగళవారం స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేశారు.

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం పేర్కొన్నారు. ఈనెల 9న 3 మి.మీ, 10న 2, 11న 1, 12న 2, 13న 1 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు.

న్యూస్‌రీల్

సప్పరం వాహనంపై ఊరేగిన వెంకన్న



సప్పరం వాహనంపై స్వామివారి తిరువీధి సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉపమాక వెంకన్న ఆలయంలో మంగళవారం సప్పరం వాహనంలో స్వామి వారికి తిరువీధి సేవలు నిర్వహించారు. ముందుగా గరుడాద్రిపై ఉన్న స్వామి వారికి నిత్యార్చణలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు అర్చనలు పూర్తి చేశారు. తదుపరి ఉభయ దేవేరులతో కూడిన స్వామి వారిని సప్పరం వాహనంలో ఉంచి మాడ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం సేవల్లో భాగంగా నిత్య కార్యక్రమం పూర్తి చేసి తిరువీధి సేవ నిర్వహించారు. బుధవారం స్వామివారికి గరుడ వాహనంపై తిరువీధి సేవ, వినోదోత్సవం జరుగుతాయని అర్చకులు తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

తుమ్మపాల: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సాగునీటి సంఘాల ఎన్నికల ఏర్పాట్లపై జల వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, సాగునీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో నియమ, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు షేక్ అయిషా, వి.వి.రమణ, నీటి పారుదల శాఖ ఈఈ ఎ.త్రినాథ్, డీఈలు, ఏఈలు, పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్ల ఉచ్చులో న్యాయవాది

- రూ.29 లక్షలకు టోకరా

అనకాపల్లి: సైబర్ నేరగాళ్లకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. వారి వలలో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి లక్షలు పోగొట్టుకున్న వైనం వెలుగులోకి వచ్చిన మర్నాడే ఓ న్యాయవాది కూడా ఈ విధంగా మోసపోయినట్టు కేసు నమోదైంది. సీఐ టి.వి.విజయకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మోసగాళ్లు సైబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులమంటూ స్థానిక న్యాయవాది భవానీ ప్రసాద్‌కు ఫోన్ చేశారు. మైనర్ బాలికలతో మసాజ్ చేయించుకుంటున్నారని, కేసు నమోదు చేస్తున్నామని బెదిరించారు. కేసు తప్పించడానికి డబ్బులు డిమాండ్ చేశారు. లేనిపోని తంటా ఎందుకని భావించిన బాధితుడు ఈ నెల 3, 4, 5 తేదీల్లో రూ.29 లక్షలు మోసగాళ్ల అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. వారు మళ్లీ డబ్బు డిమాండ్ చేయడంతో స్నేహితుడి దృష్టికి తీసుకువెళ్లాడు. అతని సలహాతో మంగళవారం పట్టణ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయగా.. సైబర్ నేరగాళ్ల అకౌంట్ నుంచి రూ.1.65 లక్షలు హోల్డ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారి దోపిడీ ముఠా అరెస్టు IIలో



సిండికేట్లు.. రింగ్ ‘లీడర్లు’

సూపర్ సిక్స్ హామీలు గాలికొదిలేశారు. శాంతి భద్రతలు దిగజారినా బేఫికర్‌గా ఉన్నారు. ధరలు మండిపోతుంటే చలనం లేదు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుంటే చీమ కుట్టినట్టయినా లేదు. ప్రజలకు మేలు చేస్తామని అధికారంలోకి వచ్చిన ‘కూటమి’ లీడర్లు.. మద్యం దుకాణాల వేలం పాటలో మాత్రం ‘రింగ్ లీడర్లు’గా మారిపోతున్నారు. జనానికి మత్తెక్కించి కోట్లు కొల్లగొట్టడానికి సిద్ధమైపోతున్నారు.



జిల్లాలో మొత్తం మద్యం దుకాణాలు **136**

ఈనెల 7వ తేదీ వరకు అందిన దరఖాస్తులు **310**

మంగళవారం ఒక్క రోజే **766**

ఇంతవరకు అందిన దరఖాస్తులు **1076**

‘అనకాపల్లి నియోజకవర్గంలో టౌన్‌లో నెహ్రూచౌక్, పెరుగుబజార్ జంక్షన్, తుమ్మపాల, కొత్తూరు, జాతీయరహదారిపై పూడిమడక రోడ్డు జంక్షన్, కేఎస్‌ఆర్ పేట, కూండ్రం, రేబాక, మామిడపాలెం, తాళ్లపాలెం, కశింకోట తదితర డిమాండ్ ఎక్కువగా ఉన్న మద్యం దుకాణాల్లో కూటమి పార్టీలకు చెందిన నాయకులు, వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడుతున్నారు. పదిమంది కలిపి రూ.20 లక్షలు పోగేసి విడివిడిగా దరఖాస్తు చేసుకుంటారు. లైసెన్సు ఎవరికి వచ్చినా అందరూ కలిసి వ్యాపారం చేసుకుంటారు. ఇంకెవరినీ అడుగు పెట్టనివ్వరు.’

‘పాయకరావుపేట నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీలకు సంబంధించిన నేతలు 60 మంది కలిపి సిండికేట్‌గా ఏర్పడి తలో రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.1.20 కోట్లు సమకూర్చుకున్నారు. జిల్లాలో డిమాండ్ ఎక్కువగా ఉన్న 120 దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎవరికి వచ్చినా అందరికీ భాగస్వామ్యం ఉంటుంది. ఎవరైనా మధ్యలో విరమిస్తే అందరూ కలిసి డ్రాప్ అయినవారికి డబ్బులు ఇచ్చేస్తారు.’

సాక్షి, అనకాపల్లి:

కొత్త మద్యం పాలసీపై ప్రభుత్వం చెప్పే మాటలకు.. చేతలకు పోలికే లేకుండా ఉంది. రెండు లక్షల రూపాయలు దరఖాస్తు రుసుం చెల్లించే స్థోమత కలిగిన వారెవరైనా సరే ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. కానీ ‘కూటమి’ ప్రజా ప్రతినిధుల అండదండలతో వారి అనుచరులు రంగంలోకి దిగి ఆన్‌లైన్లో కూడా దరఖాస్తు చేసే వీలు లేకుండా బెదిరింపులకు దిగుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారం సంగతి దేముడెరుగు.. కనీసం లైసెన్సుల కోసం దరఖాస్తు చేయడానికి కూడా వీలులేని దుస్థితి దాపురించిందని వ్యాపారులు వాపోతున్నారు. జిల్లాలో దశాబ్దాలుగా తాము మద్యం వ్యాపారం చేస్తున్నా గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని చూడలేదని చెబుతున్నారు. అధికార పార్టీల నేతల కుటుంబ సభ్యులు, వారి ముఖ్య అనుచరులు సిండికేట్ అవతారం ఎత్తారు. వైన్ షాపులు దక్కించుకునేందుకు తెర వెనుక పావులు కదుపుతున్నారు. డిమాండ్ ఉన్నచోట ఇతరులెవరూ దరఖాస్తులు చేయకుండా ప్రలోభాలకు, బెదిరింపులకు పాల్పడుతున్నారు. షాపులన్నీ అధికార పార్టీ వారే నిర్వహించేలా ‘సిండికేట్’ మాయాజాలం నడుస్తోంది. ముఖ్యంగా నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి, అనకాపల్లి, సబ్బవరంలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, వారి అనుచరులే



కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నర్సీపట్నం నియోజకవర్గంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పిందే వేదం. మద్యం దుకాణాల్లో దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన వారిని స్థానిక ఎక్సైజ్ అధికారులే స్పీకర్ గారి అనుచరులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పి వెనుదిరిగేట్లు చేస్తున్నారని సమాచారం.

ఒకరిని ఎన్ని దుకాణాలైనా..

గతంలో ఒక వ్యక్తికి ఒక దుకాణం మాత్రమే కేటాయించేవారు. ఎవరైనా పది దుకాణాల కోసం దరఖాస్తు చేసుకొంటే లాటరీలో ఒక షాపు తగలగానే మిగతా షాపుల దరఖాస్తులు రద్దయిపోయేవి. ఇప్పుడా విధానానికి మంగళం పాడారు. మొత్తం మద్యం దుకాణాలను తమ గుప్పెట్లోకి తీసుకునేందుకు అనువుగా నూతన మద్యం పాలసీని ప్రభుత్వం రూపొందించిందన్న ఆరోపణలు ఉన్నాయి. కొత్త నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. లాటరీలో ఎన్ని దుకాణాలు వస్తే అన్ని దుకాణాలను కేటాయిస్తారు. దీంతో తమ నియోజకవర్గంలోని మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. ఈ క్రమంలోనే దరఖాస్తుల దగ్గర నుంచే వారు చక్రం తిప్పడం మొదలు పెట్టారు.

ఒక్క రోజులో 766 దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 136 షాపులకు గానూ 8వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు 1076 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం వరకు 310 దరఖాస్తులే వస్తే.. మంగళవారం ఒక్కరోజే 766 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దుకాణానికి సగటున 9 దరఖాస్తులు దాఖలయ్యాయి. జిల్లావ్యాప్తంగా దరఖాస్తుల రూపంలోనే ఇప్పటివరకు రూ.21.52 కోట్ల ఆదాయం వచ్చింది. నోటిఫికేషన్ విడుదలైన తరువాత గాంధీ జయంతికి ఒకరోజు ముందు నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 9వ తేదీతో ముగుస్తుంది. ఇక మిగిలింది ఒక్క రోజే మాత్రమే.

దరఖాస్తులు ఇంకా పెరిగే అవకాశం

దరఖాస్తు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోంది. రాజకీయ ప్రమేయం ఏమీ లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్క అప్లికేషన్ తీసుకుంటున్నాం. ఇంకా ఒక్కరోజే గడువు ఉంది. దరఖాస్తులు పెరిగే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం రాని వారు నేరుగా ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్నారు. ప్రభుత్వానికి ఆదాయం ఎక్కడా తగ్గలేదు. మా టార్గెట్ మించే దరఖాస్తులు వచ్చాయి.

– సుధీర్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి

గిరాకీ ఉన్న దుకాణాలపై కూటమి నేతల కన్ను

జిల్లాలో గిరాకీ ఉన్న సెంటర్లను కూటమి నేతలు చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి, చోడవరం, అనకాపల్లి, సబ్బవరం, అచ్యుతాపురం, మాడుగుల, నక్కపల్లి, అడ్డురోడ్డు, హైవేను అనుకుని ఉన్న దుకాణాలకు డిమాండ్ ఎక్కువ. వీటిని కూటమి పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులే దక్కించుకునేందుకు సిండికేట్‌గా మారారు.

- చోడవరంలో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజుకు అత్యంత సన్నిహితుడైన టీడీపీ నేత గూనూరు మల్లునాయుడు మద్యం వ్యాపారం చేస్తుంటారు. ఆయనకు సంబంధించిన వారే ఎక్కువగా దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం.
- పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి వంగలపూడి అనిత అనుచరులు, కూటమి నాయకులు 121 మంది జిల్లా వ్యాప్తంగా డిమాండ్ ఉన్న దుకాణాలకు సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది.
- యలమంచిలి నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోదరుడు సతీష్‌కుమార్ అనుచరులే సిండికేట్‌గా ఏర్పడి.. ఆ నియోజకవర్గంలో ఉన్న మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నారని సమాచారం.
- అనకాపల్లి నియోజకవర్గంలో 24 షాపులకు గానూ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ కలిపి 150 వరకు దరఖాస్తులు వచ్చాయి. జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీడీపీ నేత పీలా గోవిందు అనుచరులే సిండికేట్‌గా ఏర్పడి... ఈ నియోజకవర్గంలో ఉన్న మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నారు.
- నర్సీపట్నం నియోజకవర్గంలో 34 షాపులకు గానూ 119 దరఖాస్తులు వచ్చాయి. స్పీకర్ అయ్యన్నపాత్రుడి అనుచరులే వందకు పైగా ఉన్నట్లు సమాచారం.



పండగ పూటా పస్తేనా..

- జీతాల కోసం ఎన్టీఆర్ ఆస్పత్రి పారిశుధ్య కార్మికుల వినతి

అనకాపల్లి: ఎన్టీఆర్ ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు బకాయిపడిన మూడు నెలల జీతాలు చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆస్పత్రిలో డీసీహెచ్ ఎస్.శ్రీనివాసరావును మంగళవారం యూనియన్ సభ్యులు కలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ జీతాలు చెల్లించాలని నల్ల బ్యాడ్జీలు ధరించి 48 రోజులుగా కార్మికులు వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. జీతాలు అందకపోవడంతో దసరాను ఎలా జరుపుకొంటామని, పండగ పూట కూడా పస్తులుండాల్సిందేనా అని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆస్పత్రి డీసీహెచ్ శ్రీనివాసరావు కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. ఈ నెల 10వ తేదీలోగా ఒక నెల జీతం చెల్లించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.సంతోష్, నూకరాజు, పోలరావు, సుధీర్, నారాయణ, అడవి రాజు, బి.ఎల్.రాజు, జగన్నాథరావు, దేవి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



జీతాలు ఇవ్వాలని ఆస్పత్రి డీసీహెచ్ శ్రీనివాసరావును కోరుతున్న పారిశుధ్య కార్మికులు

కరెన్సీ నోట్ల అలంకరణలో దుర్గమ్మ కనువిందు



గొబ్బూరులో రూ.1.60 లక్షల నోట్ల అలంకరణతో కనకదుర్గమ్మ



దేవరాపల్లిలో దుర్గాదేవిని కరెన్సీ నోట్లతో అలంకరించిన భక్తులు

కశింకోట/దేవరాపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం మహాలక్ష్మి అలంకరణలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. కశింకోట మండలం గొబ్బూరు గ్రామంలో దుర్గామల్లేశ్వరస్వామి పంచాలయాల్లో కనకదుర్గమ్మను రూ.1.60 లక్షల విలువైన నోట్లతో అలంకరించారు. రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.500 నోట్లతో మాలలు కట్టి అమ్మవారితో పాటు గర్భగుడిని అందంగా ముస్తాబు చేశారు. ఆలయ ధర్మకర్త మునగపాక సోమరాజు, ఆలయ అర్చకుడు సాయికుమారశర్మ, భవానీ భక్తులు, గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

- దేవరాపల్లిలో ఉమా మహేశ్వరీదేవి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కనకదుర్గమ్మను రూ. 38,500 విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. మహాలక్ష్మీ అవతారంలో అమ్మవారు కనువిందు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజులు చేశారు.

క్లుప్తంగా

59 ఫోన్లు రికవరీ.. బాధితులకు అందజేత


యువకుడికి ఫోన్‌ను అందజేస్తున్న జిల్లా ఎస్పీ అమిత్‌బర్ధర్

పాడేరు: చోరీకి గురైన, పోయిన 59 ఫోన్లను పోలీసులు రికవరీ చేసి, ఎస్పీ అమిత్ బర్దర్ చేతుల మీదుగా బాధితులకు అప్పగించారు. ఫోన్లు పోగొట్టుకున్న హుకుంపేట, అనంతగిరి, చింతపల్లి, పాడేరు, డుంబ్రిగుడ, అరకు, అడ్డతీగల, రంపచోడవరం, మారేడుమిల్లి తదితర మండలాలకు చెందిన వారికి జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ అమిత్‌బర్ధర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగదారులు తమ ఫోన్లను పోగొట్టుకుంటే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. కేసు నమోదు చేసి రికవరీ చేస్తామని తెలిపారు. ఎస్పీ అమిత్ బర్దర్, పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు చేసిన భర్తకు బెదిరింపులు


టిటింగ్‌వలస గ్రామస్తులు, రఘునాథ్ కుటుంబ సభ్యుల ఆందోళన

హుకుంపేట : తన భార్య కనిపించడం లేదని ఫిర్యాదు చేసిన తనను చంపేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నట్టు బాధితుడు రఘునాథ్ ఆందోళన వ్యక్తం చేశాడు. మంగళవారం టిటింగ్‌వలస గ్రామానికి చెందిన రఘునాథ్‌తో పాటు కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. రంగశీల పంచాయతీకి టిటింగ్ వలస గ్రామానికి చెందిన రఘునాథ్, ఉప్పమ్మలకు ఈ ఏడాది మార్చి 3న వివాహం జరిగింది. కొంతకాలం తరువాత ఆమె అదృశ్యమైంది. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అప్పటి నుంచి తన భార్య కుటుంబ సభ్యులు చంపేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తమను బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు.

దారి దోపిడీ ముఠా అరెస్టు

- 9 తులాల బంగారం, ఆటో సీజ్
- 3 రోజుల్లోనే చోరీ కేసు ఛేదన
- పోలీస్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ దీపిక


నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న నగలతో పోలీసులు

అనకాపల్లి: దారి దోపిడీ కేసును మూడు రోజుల్లోనే పట్టణ పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడిన ముఠాను అరెస్టు చేశారు. వారి నుంచి 9 తులాల బంగారం, ఆటో స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్పీ దీపిక విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కె.కోటపాడు మండలం గొట్లం గ్రామానికి చెందిన రావుల ఎల్లారమ్మ(59), విజయనగరం జిల్లా కొత్తవలసలోని 202 కాలనీకి చెందిన మేకల సంధ్య(28), గంటా మీనా(30), కొత్తవలస మండలం సుందరయ్యపేటకు చెందిన ఆటో డ్రైవర్ మేకల హరి (21), మరో ఇద్దరు ముఠాగా ఏర్పడి ఆటోలో తిరుగుతూ దారి దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఏపీ జెన్కోలో పనిచేస్తున్న చెక్క సుధా కూర్మన్నపాలెం వెళ్లేందుకు ఈ నెల 5న అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ బయట వేచి ఉంది. ఆ సమయంలో ఇద్దరు మహిళలతో వచ్చిన ఆటోడ్రైవర్ గాజువాక వెళ్తున్నట్టు చెప్పడంతో సుధా ఆటో ఎక్కారు. అనంతరం జాతీయ రహదారిలో జలగల మదుం వద్ద సదరు మహిళలు కత్తితో బెదిరించి బ్యాగ్‌లో ఉన్న రూ.1.80 లక్షలు విలువగల బంగారాన్ని లాక్కుని ఆమెను ఆటో నుంచి తోసి వేసి పరారయ్యారు. అదేవిధంగా మరో కేసులో మునగపాక మండలం తిమ్మరాజు పేట గ్రామానికి చెందిన తిరునగరి గోవిందమ్మ(60) అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి తన స్వగ్రామానికి వెళ్తుండగా పై నిందితులు అచ్యుతాపురం వెళ్తున్నామని ఆమె ఆటోలో ఎక్కించుకున్నారు. పూడిమడక రోడ్డులో నిందితులు కత్తులు చూపించి ఆమె వద్ద 9 తులాల బంగారాన్ని లాక్కుని పరారయ్యారు.

ఈ రెండు ఘటనలకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు అనకాపల్లి టౌన్ ఎస్.హెచ్.ఓ టి.వి.విజయ్ కుమార్ కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తులో భాగంగా నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుల్లో ఇంకా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉంది. వీరందరిపై వివిధ జిల్లాల్లో మొత్తం 45 దొంగతనం కేసులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ దీపిక అనకాపల్లి టౌన్ పోలీసులను ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులను ప్రకటించారు.

14 నుంచి పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- ఏర్పాట్లు చేయాలని కలెక్టరు ఆదేశం

తుమ్మపాల: జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పంచాయతీ వారీగా వారోత్సవాల షెడ్యూలు తయారు చేయాలన్నారు. జిల్లాకు కేటాయించిన నిధులను పూర్తిగా వినియోగించుకోవాలని, పనులు గుర్తించి ఆమోదం కోసం పంపించాలన్నారు. రూ.62 కోట్లకు సంబంధించిన పనులకు ప్రతిపాదనలు రావలసి ఉందన్నారు. రెండు రోజుల్లో పూర్తి చేసి, ఆమోదం పొందాలన్నారు. ఆమోదం పొందిన పనులకు ఈ నెల 14 నుంచి 20లోగా శంకుస్థాపనలు చేసి డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని తెలిపారు. వీటికి కావలసిన మెటీరియల్ ముందుగా సమకూర్చుకోవాలన్నారు. వ్యక్తిగతంగాను, గ్రామాల్లో డ్రెయిన్ నిర్మాణం సమయంలో సామాజిక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మినీ గోకులాలకు కూడా లక్ష్యం మేరకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. గ్రామాల్లో పూర్తిచేసిన, చేపడుతున్న పనుల వివరాలను గ్రామస్తులకు తెలిసేలా డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి, డీడబ్ల్యూఎంఏ ప్రాజెక్టు అధికారి పూర్ణిమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, పంచాయతీ రాజ్ ఇంజనీర్లు, మండల అభివృద్ధి అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

న్యాయంపూడిలో కేంద్ర బృందం పర్యటన

- కేంద్ర పథకాలు, జీవనోపాధిపై ఆరా


న్యాయంపూడిలో వివిధ శాఖల పనితీరుపై ఆరా తీస్తున్న అధికారులు

నక్కపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో కేంద్ర నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను, వాటి తీరు తెన్నులను కేంద్ర బృందం ఆరా తీసింది. కేంద్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల ప్రతినిధులు అనిల్ గైక్వాడ్, అనిల్ నిమ్ బోత్కర్ మంగళవారం నాయంపూడి గ్రామంలో పర్యటించారు. కేంద్ర పథకాలను జీవనోపాధి అవసరాలకు ఏ విధంగా వినియోగిస్తున్నారు అనే అంశంపై గ్రామ సంఘ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల పనితీరు, బ్యాంకు లింకేజీ రుణాలతో పొందుతున్న స్వయం ఉపాధి కార్యక్రమాలు గురించి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో చేస్తున్న పనులు, ఎంత మందికి ఎన్ని రోజులు పని కల్పిస్తున్నారు, గిట్టుబాటవుతున్న వేతనాలు, తదితర విషయాలు తెలుసుకున్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పోషకాహారంపై చేపట్టే అవగాహన కార్యక్రమాల గురించి ఆరా తీశారు. గ్రామీణాభివృద్ధి కోసం కేటాయిస్తున్న కేంద్ర నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. గ్రామీణ అభివృద్ధి పంచాయతీ రాజ్ అన్ని శాఖల వారి సమీక్ష నిర్వహించారు. సమావేశానికి కేంద్ర ప్రభుత్వ బృంద సభ్యులతో పాటు ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డైజీ, ఎంపీడీవో సీతారామరాజు, డీపీఎం శ్రీనివాస్, ఏరియా కోఆర్డినేటర్ సత్యవేణి, ఏపీఎం శ్రీనివాసరావు, సర్పంచ్ వరహాలుబాబు, ఎంపీటీసీ ఆకేటి గోవిందరావు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.


చేపల లోడు లారీ బోల్తా


జాతీయ రహదారి జలగలమదుం వద్ద బోర్లా పడిన చేపలలోడు కంటైనర్ లారీ

అనకాపల్లి : స్థానిక జాతీయ రహదారి జలగల మదుం కొత్త ఫ్లైఓవర్ బ్రిడ్జి టర్నింగ్ పాయింట్‌లో చేపలలోడు కంటైనర్ లారీ మంగళవారం బోల్తా పడింది. భీమవరం నుంచి విశాఖ కంటైనర్ కార్యాలయానికి వెళుతున్న లారీలో సుమారుగా రూ.80 లక్షల విలువ చేసే చేపలు రవాణా అవుతున్నాయి. సంఘటన స్థలానికి పట్టణ ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ, ఎస్ఐ డి.శేఖరం చేరుకుని పొక్లెయిన్ సహాయంతో లారీ పైకి తీశారు. మరో కాంటైనర్ లారీలో చేపలను లోడు చేసి తరలించారు.

జాతీయ యోగా పోటీలకు చోడవరం విద్యార్థి

- రాష్ట్ర స్థాయి పోటీల్లో లయవర్ధన్‌కు కాంస్యం


రాష్ట్ర స్థాయి పోటీల్లో లయవర్ధన్ వేసిన ఆసనం


రాష్ట్ర స్థాయి పోటీల్లో సర్టిఫికెట్ అందుకుంటున్న లయవర్ధన్

చోడవరం: జాతీయ స్థాయి యోగా పోటీలకు చోడవరం విద్యార్థి ఎంపికయ్యాడు. ఇటీవల కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో చోడవరం పతంజలి యోగా కేంద్రం విద్యార్థి గొంతిన లయవర్ధన్ పాల్గొన్నాడు. ఈ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబరులో అస్సాంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొననున్నాడు. గతంలో రెండుసార్లు ఎంపికై బంగారు పతకాలు సాధించినట్టు ఏపీ యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు పుల్లేటి సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా లయవర్ధన్‌ను చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, యోగా అసోసియేషన్, పతంజలి యోగా కేంద్రం నిర్వాహకులు అభినందించారు.

దివ్యాంగుల యోగక్షేమాలను ఆరా తీసిన న్యాయమూర్తి


ఇఛ్ఛా ఫౌండేషన్‌ను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి విజయ

అచ్యుతాపురం (మునగపాక): అచ్యుతాపురంలోని ఇంటిగ్రేటెడ్ దివ్యాంగుల హాస్టల్‌తోపాటు కొండకర్లలోని ఇచ్ఛా ఫౌండేషన్‌ను మంగళవారం సీనియర్ సివిల్ జడ్జి వేపకాయల విజయ సందర్శించారు. రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆమె ఈ ప్రదేశాలను పరిశీలించి, దివ్యాంగుల యోగక్షేమాలను ఆరా తీశారు. అక్కడి మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాది బి.హరిశంకర్, పీవీ రమణ, లోక్ అదాలత్ సభ్యుడు పి.నూకరాజు తదితరులు ఆమె వెంట పాల్గొన్నారు.

విశాఖ-రాయపూర్ పాసింజర్ వేళల్లో మార్పులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-రాయ్‌పూర్ పాసింజర్ వేళల్లో మార్పులు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-రాయ్‌పూర్(08528) పాసింజర్ స్పెషల్ ఈనెల 20 నుంచి ఉదయం 4.25 గంటలకు బదులుగా ఉదయం 6.30 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి, అదేరోజు రాత్రి 7.45 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుంది.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ


గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులతో నరసింహరావు

పాయకరావుపేట: జాతీయ స్థాయి యోగా పోటీల్లో స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. సీబీఎస్ఈ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 5 వ తేదీ వరకు గుజరాత్‌లోని సూరత్‌లో ఎల్.పి.పావని అకాడమీలో అండర్ -17 బాలుర విభాగంలో ఈ పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు జి.ఎస్.ఎస్.చరణ్, సోహన్ శ్రీ, బి.దేవాన్ నాయుడు, సిహెచ్.జయదీప్, వి.చైతన్య బృందం గోల్డ్ మెడల్ సాధించారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ మంగళవారం తెలిపారు. ఈ పోటీల్లో వివిధ జోన్ల నుంచి 18 టీమ్‌లు పాల్గొనగా, తమ విద్యార్థులు మొదటి స్థానం సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహరావు, యోగా గురువులు డి.సురేష్, జయంతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దివీస్ ఉద్యోగి దుర్మరణం


ఘటన స్థలంలో రాంబాబు మృతదేహం


రాంబాబు(ఫైల్)

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ సిటీనగర్ వద్ద యూనియన్ బ్యాంకు ఎదురుగా మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో శెట్టి రాంబాబు అనే దివీస్ ఉద్యోగి దుర్మరణం చెందాడు. నైట్ డ్యూటీకి వెళ్లిన రాంబాబు విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ముందున్న ట్రాక్టర్‌ను దాటి వెళ్లే ప్రయత్నం చేశాడు. ఇంతలో ఎదురుగా లారీ వస్తుండటంతో వెనక్కు తగ్గే క్రమంలో ట్రాక్టర్ వెనుక భాగం బలంగా తగిలి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర రక్తస్రావం కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన మృతుడు ఏడేళ్ల క్రితం దివీస్‌లో చేరాడు. ప్రస్తుతం జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్‌లో నివసిస్తున్నాడు. అతనికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తరలించారు. అతని మృతితో తోటి ఉద్యోగులు దుఃఖంలో మునిగిపోయారు.

'సాయి గణపతి' విద్యార్థుల ఆందోళన

- క్యాంటీన్ నిర్వహణపై ఫిర్యాదు


చట్నీలో ఈగ

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీలోని సాయి గణపతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన క్యాంటీన్‌లో పరిసరాలతో పాటు ఆహారం బాగా లేదని మంగళవారం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఆందోళన చేశారు. పరిశుభ్రత లేని కారణంగా బ్యాక్టీరియా వ్యాపించి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. అన్నం సరిగ్గా వండటం లేదని, తాగే నీళ్లలో క్రిములు ఉంటున్నాయన్నారు. శుభ్రం చేయని ప్లాస్టిక్ గ్లాసులు, బాటిళ్లు వినియోగిస్తున్నట్లు తెలిపారు. డైనింగ్ టేబుళ్లు గలీజుగా ఉంటున్నాయన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే చాలాసార్లు కళాశాల యాజమాన్యం, క్యాంటీన్ మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. అయినప్పటికీ చర్యలేవీ తీసుకోలేదన్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రమాణాలేవీ పాటించనందున వారి దృష్టికి కూడా క్యాంటీన్ విషయాలు తీసుకువెళతామన్నారు. ఈ విషయాన్ని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మహేష్‌కుమార్ దృష్టికి తీసుకురాగా వారానికి ఒకసారి తాను క్యాంటీన్‌ను తనిఖీ చేస్తానన్నారు. ఈ విషయంపై విద్యార్థులెవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. బుధవారం క్యాంటీన్‌ను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యానికి బానిసైన భర్త

- భార్య మందలించిందని ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ
మృతుడు కృష్ణ (ఫైల్)

చోడవరం: మద్యానికి బానయ్యాడని భార్య మందలించడంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రావికమతం మండలం మేడివాడలో మంగళవారం చోటు చేసుకుంది. తాపీమేస్త్రిగా పనిచేస్తున్న గంటా కృష్ణ (36) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి పదేళ్ల కిందట దేవితో వివాహమైంది. వీరికి 8, 6 వయస్సు కలిగిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నేపథ్యంలో మద్యానికి బానిసైన కృష్ణ కుటుంబ బాధ్యతలు వదిలేసి పనికి కూడా సరిగ్గా వెళ్లకపోవడంతో భార్య, అతని కుటుంబ సభ్యులు మందలిస్తూ ఉండేవారు. ఎప్పటిలాగే పూటుగా మద్యం సేవించి రావడంతో భార్య తీవ్రంగా మందలించింది. దీంతో అతని ఇంటి పక్కనే మరొక పాత ఇంటి వద్ద దూలానికి తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి చెప్పడంతో భార్య దేవి రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లక్ష్మణరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


రోమాల సాయి (19) (ఫైల్)

అనకాపల్లి : గొలగాం కాలనీకి చెందిన రోమాల సాయి (19) అనే యువకుడు విద్యుత్ షాక్‌తో సోమవారం రాత్రి మృతి చెందినట్టు రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. రూరల్ ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలివి. సోమవారం రాత్రి గ్రామంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మవారి మండపం వద్ద ప్రతి రోజు మాదిరిగానే సాయి భవానీ పూజ చేస్తున్న సమయంలో అక్కడ ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారని, మృతుడి తల్లి నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

15 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు


పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

చీడికాడ: మండలంలోని వరహాపురం కూడలి వద్ద మంగళవారం ఉదయం ఇద్దరు యువకులు, ఒక యువతి స్కూటీపై గంజాయి తరలిస్తుండగా పట్టుబడినట్లు ఎస్సై బి.సతీష్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. చోడవరం గ్రామానికి చెందిన సకినేటి దుర్గా ప్రసాద్, జయవరపు కిరణ్‌సాయి, మళ్ల కీర్తి గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు వరహాపురం కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, పైన తెలిపిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.75 వేలు విలువ చేసే 15 కిలోల గంజాయితోపాటు స్కూటీ, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సేవించే అలవాటు ఉన్న వీరు ప్యాకెట్లుగా అమ్మకాలు సాగిస్తున్నట్లు విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. వీరికి గంజాయి సరఫరా చేసిన వ్యక్తిని త్వరలో పట్టుకుంటామన్నారు. కేసు నమోదు చేసి ముగ్గురిని కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

రైల్వే ప్రయాణికుల భద్రతకు చర్యలు

తాటిచెట్లపాలెం: పండగ నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని.. పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక టికెట్ కౌంటర్లు, క్యూ ఆర్ కోడ్ ఆధారిత టికెట్లు, ఏటీవీఎం, వైటీఎస్‌కే వంటి అదనపు వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రయాణికుల కూడా సంబంధిత అధికారులు, రైల్వే సూచనలు పాటించాలని సూచించారు. సరైన టికెట్లు లేకుండా రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణించరాదని, నిషేధిత వస్తువులను తీసుకు వెళ్లరాదన్నారు. ఇటువంటివి ఏవైనా తోటి ప్రయాణికులు గమనిస్తే వెంటనే రైల్వే అధికారులకు తెలియజేయాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బ్యాంక్, ఏటీఎం సెక్యూరిటీ ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఏటీఎంల్లో దొంగతనాలను అరికట్టడం, సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ముందుగా ఏటీఎంల్లో చోరీ చేసే తీరును ఫొటోలు వీడియోలతో ప్రదర్శించారు. ఈ చోరీల నివారణకు తీసుకోవాల్సిన భద్రతా ప్రమాణాలైన సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్, ప్రైవేట్ సెక్యూరిటీ, ఇతర అంశాలపై అవగాహన కల్పించి తక్షణం వాటిని అందుబాటులోకి తీసుకురావాలని సీపీ సూచించారు. నగరంలోని 654 ఏటీఎంల్లో భద్రతా సమస్యలు ఉన్న వాటిని గుర్తించి వాటి ప్రతినిధులకు అందజేశారు. అనంతరం సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పిస్తూ నేరం జరిగిన మొదటి గంటలోనే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న నగదు మొత్తం తిరిగి వచ్చే అవకాశం ఉంటుందని వెల్లడించారు. అందుకు బ్యాంకు అధికారుల సహకారం కూడా అవసరమని తెలిపారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే నగదు బదిలీ అవుతున్న తీరు, ఏయే ప్రాంతాల నుంచి మోసాలకు పాల్పడుతున్నది, మ్యూల్ అకౌంట్లు నియంత్రించే విధానాలను వివరించారు. అలాగే అకౌంట్లు ఓపెన్ చేసేటప్పుడు కచ్చితంగా అన్ని నిబంధనలను అనుసరించాలని చెప్పారు. బ్యాంకులు, ఏటీఎం సెక్యూరిటీ ఏజెన్సీ ప్రతినిధుల సలహాలు, సమస్యలపై చర్చించారు. మరోసారి నగరంలో ఉన్న అన్ని బ్యాంకు, ఏటీఎం సెక్యూరిటీ ఏజెన్సీల జోనల్ హెడ్‌లతో సమన్వయ సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని సీపీ తెలిపారు.

800 కిలోల రేషన్ బియ్యం పక్కదారి

- పౌర సరఫరా శాఖ సిబ్బంది చేతివాటం!

మహారాణిపేట: రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా నియంత్రించాల్సిన పౌర సరఫరాల శాఖ అధికారులే చేతివాటం ప్రదర్శించడం విమర్శలకు తావిస్తోంది. నగరంలోని సీతంపేట, శాంతిపురం ప్రాంతాల్లో సోమవారం రాత్రి 800 కిలోల బియ్యాన్ని కొంత మంది తరలిస్తున్నారు. ఈ సమాచారంతో ఇద్దరు ఆ శాఖ ఉద్యోగులు దాడులు చేసి పట్టుకున్నారు. ఆ బియ్యాన్ని పరిశీలించి పీడీఎస్‌గా బియ్యంగా గుర్తించారు. అయితే ఆ బియ్యాన్ని తరలిస్తున్న వారిపై కేసు పెట్టకుండా.. వారితో బేరసారాలకు దిగినట్లు సమాచారం. వారిపై ఎలాంటి కేసు లేకుండా చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు, కూరగాయలతో సీనియర్ సిటిజన్స్ సంస్థ సభ్యులు

అనకాపల్లి: స్థానిక సీనియర్ సిటిజన్స్ సంస్థ ఆధ్వర్యంలో చోడవరం మండలం అప్పలరాజుపురంలో లలితాదేవి వృద్ధాశ్రమానికి రూ.13,500 విలువ చేసే నిత్యావసర సరకులు, కూరగాయలు మంగళవారం అందజేశారు. సంస్థ సీనియర్ సభ్యుడు కె.వి.గౌరీపతి మాట్లాడుతూ ఆశ్రమంలో 32 మంది సభ్యులు ఉన్నారని, వీరిలో ఐదుగురు పూర్తిగా మంచంపైనే ఉంటున్నట్లు చెప్పారు. వీరి కోసం ఆశ్రమంలో పది ఆవులు పెంచి, పెరుగు, పాలు నిత్యం ఇచ్చే విధంగా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. సంస్థ తరపున ప్రతినెలా 15వ తేదీలోపు తమ వంతు సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకురాలు లక్ష్మి, సంస్థ సభ్యులు ఎం.బి.వి.స్వామి, బుద్ద కాశీ, పి.జె.నాయుడు, కె.వీరభద్రరావు, ఎ.ఎస్.వి. అప్పారావు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు నియంత్రించడంలో పూర్తిగా విఫలమైనట్లు జిల్లా ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ చిన్ని యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాన్యుడికి అందుబాటులో లేకుండా ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వాపోయారు. బియ్యం గోధుమలు, పప్పు దినుసులు, వంటనూనె ధరలు చూసి బెంబేలెత్తిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల పాలనలో పేదలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దసరా పండగ లోపు ధరలు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

పరవాడ: యలమంచిలి–గాజువాక రహదారిలో జాజులవానిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. అచ్యుతాపురం మండలం తమ్మయ్యపేటకు చెందిన ముచ్చు చిన్నారావు మంగళవారం తన భార్య, పిల్లలతో కలిసి పండగ దుస్తులు కొనేందుకు బైక్‌పై గాజువాక వెళుతున్నాడు. గాజువాక నుంచి పరవాడ వైపు వస్తున్న బొలెరో వ్యాన్ చిన్నారావు బైక్‌ను ఢీ కొంది. బైక్‌పైనున్న చిన్నారావు, భార్య హేమలత, కుమారుడు సాకేత్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 126 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	5,100
రెండో రకం	3,500	4,320
మూడోరకం	3,250	3,450

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
రామనగర్ బన్నీ	: సత్యనారాయణ స్క్రీన్-1
మిస్టర్ సెలబ్రిటీ	: సత్యనారాయణ స్క్రీన్-2
కాళి	: పర్తిసాయి
సత్యం సుందరం	: షిర్డిసాయి
దక్షిణ	: వెంకటేశ్వర
మన్మథ	: శ్రీసత్య
శ్వాగ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 68 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-31 యూనిట్లు, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాటిజివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 382 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 361 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

వరిలో ఆకుముడత పురుగు

- నివారణకు ఇన్‌చార్జి ఏడీఆర్ రమణమూర్తి పలు సూచనలు



జి.భీమవరంలో అవగాహన కల్పిస్తున్న ఏవో స్వప్న



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీఆర్ రమణమూర్తి



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఏవో స్వప్న

అనకాపల్లి: వాతావరణ పరిస్థితులతో వరిలో ఆకుముడత పురుగు ఆశించే అవకాశం ఉన్నందున, ట్రైకోగ్రామా జపానికం పరాన్న జీవులు ఎకరానికి 20 వేల చొప్పున విడుదల చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ కె.వి.రమణమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో ఆయన సమావేశమై పలు సూచనలు, సలహాలు చేశారు. 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 0.3 మి.లీ. క్లోరాంత్రనిలిప్రోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. క్రిమిసంహారక మందు పిచికారీ చేయక ముందు ఎరువు వేస్తే పురుగు ఉధృతి ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. క్రిమిసంహారక మందు వేసిన తర్వాత ఎరువు వేసుకోవాలని సూచించారు. ట్రైకోకార్డులు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్నాయన్నారు. వరిలో సుడిదోమ ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు పొలం నుంచి నీటిని బయటికి తీసివేసి, అడపాదడపా ఆరబెట్టాలన్నారు. తర్వాత మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లేదా పైమెట్రోజిన్ 0.6 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పొడతెగులు నివారణకు సిఫార్సు మేరకే ఎరువులు వేసుకుని, తెగులు కనిపించినట్లయితే హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా నేటివో(టేబుకొనజోల్, ట్రైఫ్లోక్సిస్ట్రోబిన్) మందును 0.4 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. చెరకులో పసుపు ఆకు తెగులును వ్యాప్తి చేసే పేనుబంక పురుగుల ఉధృతి ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పెరిగే అవకాశం ఉందన్నారు. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రబీలో కంది, ఉలవలు సాగు చేసుకునే వారు జనుము, బొబ్బరి వంటి పంటలను వేసుకోవడానికి ఇది అనువైన సమయమన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వి.గౌరీ, బి.భవాని, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: ఖరీఫ్ వరిలో పొడ తెగులు, ఆకు ముడత పురుగు ఆశించాయని, వాటి నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా జి.భీమవరం, గైతుల పాలెంలలో మంగళవారం క్షేత్ర స్థాయిలో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో పొడ తెగులు, ఆకు ముడత పురుగు ఉధృతంగా ఉందని గుర్తించారు. వీటి నివారణకు హెక్సా కొనజోల్, క్లోరిఫైరిఫాస్ మందును పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. బొప్పాయి, కాయగూరల పంటలను పరిశీలించి వాటిపై వచ్చు చీడపీడల గురించి, నివారణ చర్యలు గురించి వివరించారు. సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పంటల దిగుబడికి వ్యవసాయ అధికారుల సూచనలు సకాలంలో పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. సూక్ష్మ నీటిపారుదల ఏరియా కో–ఆర్డినేటర్ రంజిత మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ పైపులను రాయితీపై అందివ్వనున్నట్లు తెలిపారు. సర్పంచ్ హనుమంతు వెంకట లక్ష్మణరావు, గ్రామ నాయకులు ద్వారపురెడ్డి సత్తిబాబు, తురకలపూడి సూరిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.ఎం.నాయుడు, ఉద్యాన సహాయకుడు బుద్ద కిషోర్, వ్యవసాయ సహాయకుడు కె.సన్యాసినాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



శంకరంలో అవగాహన కల్పిస్తున్న ఏవో రంగాచారి

అనకాపల్లి: మండలంలో గొలగాం, శంకరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పొలాల్లో ఆకు ముడత, పొడ తెగులు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఏవో పి.రంగాచారి వివరించారు. హెక్సా కొనజోల్ అనే మందును రెండు మిల్లీలీటర్లు లీటరు నీటికి, ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుత పంటకు ఎకరానికి 25 కేజీలు యూరియా, 15 కేజీలు పొటాస్ వేయాలన్నారు. ఈ– పంటలో నమోదు చేయించుకోవాలన్నారు. శంకరం గ్రామంలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన 130 మంది రైతులకు పరిహారం వారి ఖాతాలకు ఎకరానికి రూ.పది వేలు చొప్పున ప్రభుత్వం నుంచి అందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ ప్రతినిధి లావణ్య, శంకరం సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, వ్యవసాయ సహాయకురాలు పద్మ, గొలగాం వ్యవసాయ సహాయకుడు అజయ్, రైతులు పాల్గొన్నారు.

‘విజయవాడ వరదల నిధులు, విరాళాలు స్వాహా’

అనకాపల్లి: విజయవాడ దుర్గమ్మ సాక్షిగా కూటమి ప్రభుత్వం నీచానికి ఒడిగట్టిందని, అక్కడ ప్రజలకు ముందస్తు వరద సమాచారం ఇవ్వకుండా ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతీసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వరద బాధితుల సహాయం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1036 కోట్లు, సీఎం సహాయ నిధికి రూ.450 కోట్లు ఇస్తే, వాటి ఖర్చులో చేతివాటం చూపించారన్నారు. ఇంత ఖర్చు తమకే చేశారా? అని విజయవాడ ప్రజలే ఆశ్చర్యానికి గురవుతున్నారన్నారు. వరద బాధితులకు భోజనాల ఖర్చు రూ. 368 కోట్లు చూపిస్తే, మరి అక్షయపాత్ర సంస్థ, దాతలు ఎవరికి భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారన్నారు. మంచినీటి బాటిళ్లకు రూ.26 కోట్లు ఖర్చు చేస్తే, ఎంతమందికి వాటిని అందించారని ప్రశ్నించారు. అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులకు రూ. 23 కోట్ల ఖర్చయితే, నేటికీ చాలా మంది చీకటిలోనే మగ్గుతున్నారని వాపోయారు. నిత్యావసర సరకులకు రూ.61 కోట్లు, పారిశుధ్యం మెరుగుకు రూ.51 కోట్లు, కార్మికుల ఖర్చు రూ. 5.25 కోట్లు, రవాణా వాహనాలు రూ.5 కోట్లు, చిన్నచిన్న పనులకు భారీ ఖర్చులు చూపించి, వరద బాధితులకు వచ్చిన నగదు దోచుకున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికీ సాయం కోసం వరద బాధితులు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నారంటే, అక్కడ కూటమి ప్రభుత్వం అవినీతి దాహానికి అద్దం పడుతుందన్నారు. అవినీతి కోసమే చంద్రబాబునాయుడు పాలనలో విపత్తులు వస్తాయన్నారు. 2014 టీడీపీ పాలనలో విశాఖలో హుద్‌హుద్‌కు వచ్చిన విరాళాలు స్వాహా చేసినట్లుగా, విజయవాడ నిధులు కాజేసినట్లు పేర్కొన్నారు.

11న విశాఖలో మంద కృష్ణ మాదిగ సమావేశం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కట్టమూరి మంగరాజు

అనకాపల్లి: విశాఖ డాబాగార్డెన్ వద్ద అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 11న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విచ్చేయుచున్నట్లు జిల్లా అధికార ప్రతినిధి కట్టమూరి మంగరాజు అన్నారు. స్థానిక సంకర మెట్ట జంక్షన్ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల నుంచి అత్యధికంగా మాదిగ, మాదిగ ఉపకులాల, సోదరులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టి పాస్ చేయాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే చాలా నోటిఫికేషన్లు ఇచ్చిందని, వాటిలో మాదిగ, మాదిగ ఉపకులాల నిరుద్యోగులకు ఎంతో అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చిన్న అప్పారావు కోశాధికారి చెవ్వేటి అప్పారావు, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకినాడ కనకేశ్వరరావు, సభ్యులు పెట్ల వెంకట నాగేశ్వరరావు, చెవ్వేటి కమల చంటి, పెట్ల బాలు, మారేడిపూడి ఈశ్వరరావు, పెట్ల అచ్చయ్య నాయుడు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జాతీయ పోటీలకు చందు



మామిడి చందు

సబ్బవరం: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ జట్టులో సబ్బవరం మండలం ఇరువాడ శివారు గణపతినగర్‌కు చెందిన మామిడి చందుకు స్థానం దక్కింది. అండర్–19 విభాగంలో సీబీఎస్ఈ సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీల్లో అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ తరపున చందుతో కలిసి ప్రాతినిధ్యం వహించిన జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పోటీలు హైదరాబాద్‌లోని మియాపూర్‌లో గల ది క్రాస్ ప్లానెట్ స్కూల్‌లో గత నెల 27 నుంచి ఈ నెల 2 వరకు జరిగాయి. ఈ జట్టు ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా మోడీనగర్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనుంది. ఫస్టియర్ ఇంటర్ చదువుతూ క్రీడల్లో రాణిస్తున్న చందును స్వగ్రామం ఇరువాడ, గణపతినగర్ గ్రామస్తులు అభినందించారు.

జయమునిమ్ము జగన్మాత

దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. భక్తులు నిత్య పూజలు చేస్తూ అమ్మవారి సేవలో తరిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కొలువుదీరిన దుర్గాదేవి వివిధ రూపాల్లో దర్శనమివ్వగా, కశింకోటలో కరెన్సీ అలంకరణలో అమ్మవారు ఆకట్టుకున్నారు. పలు చోట్ల అన్నసమారాధనలు ఏర్పాటు చేయగా, తుమ్మపాలలో సారె ఊరేగింపు వేడుకగా జరిగింది.

- దుర్గాదేవి దేవాలయాల్లో విశేష పూజలు
- ఘనంగా శరన్నవరాత్రోత్సవాలు
- తుమ్మపాలలో సారె ఊరేగింపు



కనకదుర్గ అవతారంలో గౌరీదేవి



మహాలక్ష్మీదేవి అవతారంలో సతకంపట్టు కనకదుర్గ



వ్యాఘ్ర వాహిని అలంకరణలో కన్యకాపరమేశ్వరి



కశింకోటలో కరెన్సీ అలంకరణలో కనకదుర్గ



కశింకోట శివాలయంలో మహాలక్ష్మిదేవి అలంకరణలో..



సరస్వతి దేవిగా కామాక్షి అమ్మవారు

అనకాపల్లి: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం అమ్మవార్లు వివిధ అలంకరణలో దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారి దేవాలయాలు, మండపాలు దేవీ నామ స్మరణతో మార్మోగాయి. మహిళలు, భవానీ భక్తులు పాల్గొని కుంకుమ పూజలు చేశారు.

నూకాంబిక అమ్మవారి బాలాలయంలో...

ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో గణపతి పూజ, కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ఉదయం 9 గంటలకు మనో పాశుపతాభిషేకం –మన్యు సూక్త హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద అట్లూరి లజపతిరాయ్, నాగజ్యోతి, గ్రంధి గణేష్, లక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో వెయ్యి మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాత్రి 7 గంటలకు అమ్మవారి ఆలయంలో ఊంజల్ సేవా కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు చేపట్టారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవిగా సతకంపట్టు కనకదుర్గమ్మ...

స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు భోగారపు వెంకటరమణ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, హోమాలు, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దంపతులు ఆర్థిక సాయంతో భవానీ భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తి రథయాత్రను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కనకదుర్గ దేవిగా..

గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీదేవి కనక దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు అంపోలు రాంప్రసాద్ శర్మ, కోట శ్రీకర్ శర్మ, అంపోలు గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ మహిళలతో (హరిద్ర శృంగార్చన) సహస్ర పసుపు కొమ్ముల పూజ నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

సరస్వతి దేవి అవతారంలో కామాక్షిదేవి....

స్థానిక నిదానందొడ్డిలో కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారు భక్తులకు సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, కమిటీ ఉపాధ్యక్షుడు కొంత్యాణ సతీష్, కోశాధికారి ధవలేశ్వరం లక్ష్మణరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాఘ్ర వాహినీదేవి అవతారంలో కన్యకాపరమేశ్వరి..

స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు వ్యాఘ్ర వాహినీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం బేడసేవ, శ్రీచక్ర అభిషేకాలు, నక్షత్ర హారతి, గోపూజ వంటి కార్యక్రమాలు చేపట్టారు. హరే శ్రీనివాస భజన మండలి బొండాడ ప్రమీల శిష్యు బృందంచే భక్తి గీతాలు, కోలాటం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ప్రతిష్ట శత జయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు పాల్గొన్నారు.



కొత్తపేట వీధిలో సారె ఊరేగింపులో పాల్గొన్న సంఘం సభ్యులు



తుమ్మపాల గ్రామం కొత్తపేట వీధిలో సారె ఊరేగింపు

సత్యనారాయణపురంలో...

మండలంలో సత్యనారాయణపురం గ్రామంలో కనకదుర్గ కొండపైన అమ్మవారు భక్తులకు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి ధర్మాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారుజామునుంచి అమ్మవారికి పంచామృత అభిషేకాలు, హోమం, కుంకుమ పూజలు చేపట్టారు. మధ్యాహ్నం వెయ్యి మంది భవానీ భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథ్‌రావు, ఆలయ ధర్మకర్త బోయిన రమణాజీ, చైర్మన్ మేడిశెట్టి రామసత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి వెంకట రమణ కిషోర్, గౌరవాధ్యక్షులు పలకా సత్యనారాయణ, అన్నదానం ట్రస్ట్ చైర్మన్ దుడ్డు శ్రీనివాసరావు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపాలెంలోని సతకంపట్టులో దుర్గాదేవి విగ్రహానికి పూజలు

తుమ్మపాల గ్రామంలో....

తుమ్మపాల గ్రామంలో కొత్తపేట వీధిలో బాల గణపతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 108 రకాల పిండి వంటకాలతో గ్రామ పురవీధుల్లో సారె ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కనకదుర్గమ్మకు నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. 18 సంవత్సరాలుగా దుర్గదేవి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని సంఘం సభ్యులు తెలిపారు.

కశింకోట: స్థానిక శివాలయంలో సర్వమంగళాంబ మంగళవారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారిని కలువ పూలతో అందంగా అలంకరించారు. సహస్ర నామార్చన చేశారు. కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఇక్కడి జాతీయ రహదారి వద్ద కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి కరెన్సీ మాలలు అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎం ప్రసాద్‌బాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తాళ్లపాలెంలో సతకంపట్టు వద్ద నెలకొల్పిన దుర్గాదేవిని భవాని భక్తులతోపాటు సాధారణ భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.



నూకాంబిక అమ్మవారి ఆలయంలో మనో పాశుపతాభిషేకం



నూకాంబిక అమ్మవారి ఆలయంలో మన్యు సూక్త హోమం



గౌరీ పంచాయతన దేవాలయంలో సహస్ర పసుపు కొమ్ముల పూజ

నిర్వాసిత గ్రామాల్లో సౌకర్యాల కల్పనే ఎన్టీపీసీ లక్ష్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎన్టీపీసీ సీజీఎం సిన్హా, వాటాదారులతో సీజీఎం సిన్హా, అధికారులు

పరవాడ: ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామాల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎన్టీపీసీ సింహాద్రి సీఎస్సార్ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని సంస్థ హెచ్ఆర్ ఏజీఎం బి.బి.పాత్ర అన్నారు. ఎన్టీపీసీ పరిపాలన భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సీఎస్సార్ వాటాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023–24లో సీఎస్సార్ విభాగం ద్వారా నిర్వాసిత గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమాలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) సంజయ్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ సింహాద్రి ఎన్టీపీసీ విజయ పరంపరలో పూర్తి సహకారం అందించిన స్థానిక సంస్థల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్య, వైద్యం, నీరు, నైపుణ్యాభివృద్ధి వంటి సౌకర్యాల కల్పకు కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి విషయంలో పరవాడ మండలాన్ని అనకాపల్లి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎస్సార్ విభాగం హెచ్ఆర్ మేనేజర్ ప్రకాశరావు మాట్లాడుతూ 2023–24లో సంస్థ సీఎస్సార్ ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 2024–25లో చేపట్టనున్న ప్రణాళికలను ప్రజా ప్రతినిధులకు వివరించారు. నాయుడుపాలెంలో శ్మశానవాటికలో షెడ్ నిర్మాణం, వెంకటపతిపాలెంలో సామాజిక భవనం, వాటర్ ట్యాంకు నిర్మాణాలకు సీఎస్సార్ ద్వారా నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మిసీతారామయ్య కోరారు. సంస్థ విడుదల చేస్తున్న వ్యర్థ జలాల ద్వారా నష్టపోయిన ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు సంస్థలో ఉపాధి అవకాశాలు కల్పించి, గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు కోరారు. సమావేశంలో ఓ అండ్ ఎం జీఎం ప్రశాంతకుమార్‌జెనా, టెక్నికల్ సర్వీసెస్ జీఎం ఎస్.పద్మప్రియ, డీజీఎం హెచ్ఆర్ శ్రీమంత మహాపాత్ర, అధికారులు పాల్గొన్నారు.